క్లుప్తంగా

జాడుపల్లిలో లక్ష్మీనారాయణ స్వామి కల్యాణ మహోత్సవం


అన్నప్రసాదాన్ని స్వీకరిస్తున్న భక్తులు

మెళియాపుట్టి: జాడుపల్లి గ్రామంలో వెలసి యున్న లక్ష్మీనారాయణ స్వామి కల్యాణ మహోత్సవం శుక్రవారం ఘనంగా జరిగింది. ప్రత్యేక పూజల్లో భక్తులు పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. మధ్యాహ్నం అన్నసమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు.

చదువుతోనే ఉజ్వల భవిష్యత్


మౌనికను అభినందిస్తున్న అధ్యాపకులు

సరుబుజ్జిలి: కష్టపడి చదివే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందని పురుషోత్తపురం జెడ్పీ హైస్కూల్ హెచ్ఎం తులసీరావు అన్నారు. ఇటీవల నిర్వహించిన జిల్లాస్థాయి సైన్స్ ప్రదర్శనలో ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి ప్రదర్శనకు ఎంపికైన పాఠశాలకు చెందిన విద్యార్థిని పైడి మౌనికను శుక్రవారం అధ్యాపకులు అభినందించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, నాన్ టీచింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో విగ్రహాల ప్రతిష్ట


అన్నసంతర్పణలో భక్తులు

హిరమండలం: మండల కేంద్రమైన హిరమండలం న్యూబ్యారేజీ సెంటర్‌లో కొలువైన కోదండ రామాలయంలో ప్రధాన ద్వారానికి ఇరువైపులా దాతలు కోట్ని రమేష్ దంపతులు ఏర్పాటు చేసిన జయ, విజయుల విగ్రహాల ప్రతిష్ఠా మహోత్సవం శుక్రవారం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ప్రధాన అర్చకులు పులఖండ శ్రీనివాసశర్మ, శ్యామ్‌బాబుల ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు చేసి విగ్రహ ప్రాణప్రతిష్ఠ, పూర్ణాహుతి, కలశపూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. అనంతరం భక్తులకు అన్నప్రసాదాన్ని వితరణ చేశారు.

ప్రయోగ పరీక్షలకు ఏర్పాట్లు


సీసీ కెమెరాను ఏర్పాటు చేస్తున్న దృశ్యం

కొత్తూరు: ఇంటర్మీడియెట్ రెండో ఏడాది విద్యార్థులకు ఈ నెల 26వ తేదీ నుంచి ప్రయోగ పరీక్షలు జరగనున్నాయి. పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని బోర్డు అధికారులు ఉన్నతాధికారులను ఆదేశించింది. దీంతో కొత్తూరు ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ప్రిన్సిపాల్ బండారు రవికుమార్ పరీక్షలు జరగనున్న గదుల్లో సీసీ కెమెరాలను శుక్రవారం ఏర్పాటు చేశారు.

భక్తి శ్రద్ధలతో ఆలయ వార్షికోత్సవం

సారవకోట: సత్రాం గ్రామంలోని దత్తాత్రేయ స్వామి వారి ఆలయ వార్షికోత్సవాన్ని శుక్రవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. స్వామి వారిని పువ్వులతో ప్రత్యేక సుందరీకరించారు. ప్రత్యేక, విశేష పూజలు అభిషేకాలు జరిగాయి. ఆలయ ప్రాంగణంలో భక్తులు అరటి గెలలు వేలాడదీసి తమ మొక్కులు తీర్చుకున్నారు.

వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి


విద్యా ప్రమాణాలు తెలుసుకుంటున్న శ్రీధర్

కొత్తూరు: చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టిసారించాలని ఎంఈవో బి.శ్రీధర్ కొత్తూరు కాలనీ ప్రాథమిక పాఠశాల హెచ్ఎం కవితకు సూచించారు. పాఠశాలను ఎంఈవో ఆధ్వర్యంలోని బృందం వార్షిక తనిఖీల్లో భాగంగా శుక్రవారం సందర్శించింది. ఈ సందర్భంగా పలు రికార్డులతో పాటు ఉపాధ్యాయుల బోధన ప్రణాళిక, డైరీలను పరిశీలించారు. తరగతి గదులకు వెళ్లి పిల్లలకు ప్రశ్నలు వేసి జవాబులు రాబట్టి విద్యా ప్రమాణాలు తెలుసుకున్నారు. మండల విద్యాశాఖ కార్యాలయం సిబ్బంది రాజేష్, సంతోషితో పాటు పలువురు సీఆర్పీలు ఉన్నారు.

నదీ తీరం.. వాణిజ్య పంటలకు నిలయం!

- రెండు నదులు.. ఐదు మండలాలు
- తీరంలో విస్తారంగా సాగవుతున్న పంటలు
- ఏటా పెరుగుతున్న సాగు విస్తీర్ణం


లక్ష్మీనర్సుపేట వద్ద వంశధార తీరంలో సాగులో ఉన్న పంటలు

నియోజకవర్గంలో రబీ సీజన్‌లో సాగు విస్తీర్ణం ఇలా..

మండలం	సాగు విస్తీర్ణం (ఎకరాల్లో)
పాతపట్నం	4,800
మెళియాపుట్టి	5,250
కొత్తూరు	5,600
హిరమండలం	3,100
ఎల్.ఎన్.పేట	2,850

ఎల్.ఎన్.పేట: జిల్లాలో మరే నియోజకవర్గానికి లేని గొప్పతనం పాతపట్నానికి ఉంది. ఈ నియోజకవర్గం పరిధిలోని ఐదు మండలాల్లో రెండు జీవనదులు ఉన్నాయి. వంశధార, మహేంద్రతనయ నదులు ఉండడంతో వాణిజ్య పంటల సాగుకు కలిసి వస్తున్నాయి. మెళియాపుట్టి, పాతపట్నం మండలాలు మహేంద్రతనయ నదీతీరంలో ఉండగా కొత్తూరు, ఎల్.ఎన్.పేట మండలాలు వంశధార తీరంలో ఉన్నాయి. హిరమండలం మండలం మరో ప్రత్యేకను కలిగి ఉంది. ఇది వంశధార, మహేంద్రతన నదీ తీరంలో భాగమై ఉంది. మరోవైపు జిల్లా రైతంగానికి సాగునీరు అందించే గొట్టాబ్యారేజ్, వంశధార ప్రాజెక్టులు సైతం పాతపట్నం నియోజకవర్గం హిరమండలం మండలంలోనే ఉన్నాయి. రెండు జీవనదులు ఉండటంతో ఇక్కడ సాగునీటి సమస్య ఉండదు. వర్షాకాలంలో ఖరీఫ్ సీజన్‌లో పంటలు ఎలాగైనా పండించే సత్తా ఇక్కడి రైతులకు ఉంది. ఇక రబీలో వేసవి పంటలుగా వేసుకునే వాణిజ్య పంటలు సైతం సునాయాసంగా పండిస్తున్నారు. నియోజకవర్గంలోని ఏ మండలానికి వెళ్లినా వాణిజ్య పంటలు కనుచూపు మేర భూమికి పచ్చని రంగేసినట్లు కనిపిస్తాయి.

పండించే పంటలు

పాతపట్నం నియోజకవర్గంలో అధిక విస్తీర్ణంలో పండించే పంటలు చాలా ఉన్నాయి. వీటిలో మొక్కజొన్న, కట్టిజనుమ, సారికంద, రాగులు, హైబ్రీడ్ పెసర, చెరకు, పత్తి, ఉలవ, తర్బూజా, నువ్వు, వేరుశనగ పంటలతో పాటు వరి, కూరగాయలను రైతులు ఎక్కువ సాగు చేస్తున్నారు.

పెరిగిన మొక్కజొన్న సాగు



గతం కంటే ఈ ఏడాది మొక్కజొన్న సాగు విస్తీర్ణం పెరిగింది. నదుల తీరంలో ఉన్నందున సాగు నీటి సమస్య ఉండదు. మోటార్ల సాయంతో పంటలకు సాగునీరు అందించుకుంటూ సాగు చేస్తున్నారు. మొక్క జొన్నతో పాటు కట్టిజనుమ రకం కూడా ఎక్కువగానే సాగు చేస్తున్నారు. రైతులకు సూచనలు, సలహాలు అందిస్తూ గ్రామ సచివాలయ వ్యవసాయ సహాయకులు అందుబాటులో ఉంటున్నారు.

పైడి లతశ్రీ, ఏవో ఎల్.ఎన్.పేట

'పట్టభద్రుల' ఎన్నికకు చురుగ్గా ఏర్పాట్లు

- మూడు నియోజకవర్గాల్లో 21 పోలింగ్ కేంద్రాలు
- 19,056 మంది ఓటర్లు

నరసన్నపేట: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎన్నికల నిర్వహణకు అధికార యంత్రాగం చురుగ్గా ఏర్పాట్లు చేస్తోంది. నామినేషన్ల ఘట్టం పూర్తి కావడంతో పోలింగ్ కేంద్రాల ఏర్పాటు, సౌకర్యాలపై దృష్టి పెట్టారు. నరసన్నపేట, ఆమదాలవలస, పాతపట్నం నియోజకవర్గ పరిధిలోని మండలాల్లో రెవెన్యూ యంత్రాంగం సమన్వయంతో ముందుకెళ్తోంది. ఈ మూడు నియోజకవర్గాల్లో 21 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. 19,056 మంది ఓటర్లు ఉన్నారు. కాగా నియోజకవర్గాల్లో జోనల్ ఆఫీసర్లు, రూట్ ఆఫీసర్లు శిక్షణ కార్యక్రమాలకు సన్నాహాలు చేస్తున్నారు. నరసన్నపేటలో శనివారం శిక్షణ కార్యక్రమం జరగనుంది. అలాగే పోలింగ్ కేంద్రాలకు సిబ్బందిని గుర్తించే ప్రక్రియ కూడా మొదలైంది. అన్ని పార్టీలు ఎంఎల్‌సీ ఎన్నికను ప్రతిష్ఠాత్మకంగా తీసుకోవడంతో అభ్యర్థులు ప్రచారం ప్రారంభించారు.

ఎంఎల్‌సీ ఓటర్ల వివరాలు..

నియోజకవర్గం	మండలం	పోలింగ్ కేంద్రాల నంబర్	పురుషులు	స్త్రీలు	మొత్తం ఓటర్లు
నరసన్నపేట	నరసన్నపేట	46,47,48	1663	765	2428
	జలుమూరు	35	764	276	1040
	సారవకోట	29	802	301	1103
	పోలాకి	49,50	1030	433	1464
ఆమదాలవలస	ఆమదాలవలస	43,44,45	2144	979	3123
	బూర్జ	37	969	318	1287
	సరుబుజ్జిలి	36	750	271	1021
	పొందూరు	62,63,64	1942	634	2206
పాతపట్నం	పాతపట్నం	5,6	1162	515	1677
	కొత్తూరు	04	937	291	1228
	హిరమండలం	22	534	226	760
	మెళియాపుట్టి	07	640	212	852
	ఎల్ఎన్‌పేట	28	365	132	497

సీతంరాజు సుధాకర్‌ను గెలిపించండి


ప్రచారం చేస్తున్న రవికుమార్

ఆమదాలవలస రూరల్: పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా వైఎస్సార్‌సీపీ మద్దతుతో పోటీ చేస్తున్న సీతంరాజు సుధాకర్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు చింతాడ రవికుమార్ కోరారు. బొబ్బిలిపేట గ్రామంలో శుక్రవారం ప్రచారం చేశారు. ఓటర్లను కలిసి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సుపరిపాలన గురించి తెలియజేశారు. రాష్ట్రంలో చదువుకున్న యువతకు సుమారు రెండు లక్షల ఉద్యోగాలు కల్పించడం జరిగిందన్నారు. చదువుకున్న యువతకు ఉపాధి కల్పన జరగాలంటే వైఎస్సార్‌సీపీ బలపర్చిన అభ్యర్థి సుధాకర్‌కు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలన్నారు. ప్రచారంలో భాగంగా ఓటర్లకు పోలింగ్ బూత్ నంబర్‌తో పాటు పూర్తి వివరాలు కలిగిన కరపత్రాలను అందజేశారు.

స్పీకర్‌ను కలిసిన డాక్టర్స్ సెల్ అధ్యక్షుడు వరుణ్


స్పీకర్ తమ్మినేనితో వరుణ్

ఆమదాలవలస: వైఎస్సార్‌సీపీ డాక్టర్స్ సెల్ విభాగం జిల్లా అధ్యక్షుడుగా నియమితులైన డాక్టర్ చింతాడ వరుణ్ శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాంను ఆమదాలవలసలోని తన క్యాంపు కార్యాలయంలో శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిశారు. పదవి వచ్చినందుకు స్పీకర్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు. పార్టీ బలోపేతానికి కృషి చేయాలని స్పీకర్ ఆయనకు సూచించారు.

పాఠశాల సందర్శన

ఎల్.ఎన్.పేట: మధ్యాహ్న భోజన పథకం రుచికరంగా వండి పెట్టాలని ఎంఈఓ ఎస్.శ్రీనివాసరావు వంట ఏజెన్సీని ఆదేశించారు. మండల కేంద్రంలో ఉన్న రోటరీనగర్ పాఠశాలను ఆయన శుక్రవారం పరిశీలించారు. ప్రభుత్వ మెనూ ప్రకారం వండి పెట్టాలన్నారు. విద్యార్థులను అడిగి భోజన పరిస్థితిని తెలుసుకున్నారు. ఆయనతో పాటు సీఆర్పీలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

హిరమండలం: హిరమండలం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కేవీ ఫీడర్‌లో స్తంభాల మార్పు, ఇతర పనులు చేపట్టే నిమిత్తం శనివారం ఏడు గ్రామాలకు సరఫరాలో అంతరాయం ఉంటుందని పాలకొండ ఈఈ టీజేకే మూర్తి తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. గొట్ట, చొర్లంగి, తుంగతంపర, తుంగతంపర కాలనీ, అవలంగి, కల్లట, జిల్లోడిపేట గ్రామాలకు ఉదయం పది నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

ఆడపిల్ల చదువు అవనికి వెలుగు

హిరమండలం: ఆడపిల్ల చదువు అవనికి వెలుగునిస్తోందని హిరమండలం ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి సీహెచ్ సాయిగీత అన్నారు. స్థానిక కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో బేటీబచావో..బేటీపడావో కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఆడపిల్లలను రక్షించి చదివించడం అందరి బాధ్యత అన్నారు.

బాలికల సంక్షేమం, వారి చదువు కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నాయన్నారు. మగవారితో సమానంగా ఆడవారు కూడా అన్నిరంగాల్లో రాణిస్తున్నారన్నారు. అనంతరం భారతదేశ మ్యాప్ ఆకృతిలో బాలికలను కూర్చోపెట్టారు. కార్యక్రమంలో కేజీబీవీ ఎస్‌వో ఎస్.కృష్ణవేణి, ఉపాధ్యాయినులు పాల్గొన్నారు.


భారతదేశ మ్యాప్ ఆకృతిలో విద్యార్థినులు

తూకం వేసిన తరువాతే బియ్యం ఇవ్వాలి

కొత్తూరు: మండల స్థాయి సివిల్ సప్లయ్ గొదాం (ఎంఎల్ఎస్ పాయింట్) వద్దే బియ్యాన్ని సక్రమంగా తూకం వేసిన తరువాతే డీలర్లకు సరఫరా చేయాలని రేషన్ షాపు డీలర్ల సంఘం నాయకులు కోరారు. ఈ మేరకు కొత్తూరు మండల రేషన్ షాపుల డీలర్ల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు దారపు శ్రీరామకృష్ణ, తచంద్ర ప్రభాకరరావులు అధికారులకు శుక్రవారం కలిసి విజ్ఞప్తి చేశారు.

స్థానిక ఎంఎల్ఎస్ పాయింట్ వద్ద కొత్తూరు మండలం రేషన్ షాపు డీలర్లు సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సంఘ నాయకులు మాట్లాడుతూ.. ఎంఎల్ఎస్ గొదాం నుంచి వస్తున్న బస్తాకు 50 కిలోల 580 గ్రాములు ఉండాల్సి ఉండగా.. రెండు నుంచి మూడు కిలోల వరకూ తక్కువ వస్తున్నట్టు పేర్కొన్నారు. ఈ పరిస్థితి లేకుండా చూడాలన్నారు.


నిరసన తెలియజేస్తున్న డీలర్లు

ఈనాడు తప్పుడు కథనాలు కక్ష పూరితమే..


ఈనాడు ప్రతులను దహనం చేస్తున్న కృష్ణచైతన్య తదితరులు


పాతపట్నం: ఈనాడు ప్రతులను దహనం చేస్తున్న నాయకులు

నరసన్నపేట: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని అప్రతిష్టపాలు చేస్తూ చంద్రబాబుకు లేని ఇమేజ్‌ని పెంచేందుకు ఈనాడు పత్రిక తాపత్రయ పడుతోందని పోలాకి జెడ్పీటీసీ సభ్యుడు ధర్మాన కృష్ణ చైతన్య అన్నారు. దీంట్లో భాగంగానే ప్రభుత్వంపై బురద జల్లి తప్పుడు కథనాలు ప్రచురిస్తుందని.. ఇది పత్రికా స్వేచ్ఛను దుర్వినియోగం చేయడమేనన్నారు. టీడీపీ నాయకుడు పట్టాభి విషయంలో పాత ఫొటోలతో తప్పుడు కథనాన్ని ఈనాడు ప్రచురించినందుకు నిరసనగా స్థానిక బజారువీధిలో పంచాయతీ కార్యాలయ కూడలి వద్ద శుక్రవారం ఆ పత్రిక ప్రతులను దహనం చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కావాలని ప్రభుత్వంపై బురదజల్లే కథనాలను ప్రజలు నమ్మవద్దన్నారు. పేదలకు మేలు చేసే వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో జలుమూరు ఎంపీపీ వాన గోపి, నరసన్నపేట సర్పంచ్ బూరల్లి శంకర్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు చింతు రామారావు, పోలాకి మండల పరిషత్ ప్రత్యేక సలహాదారు ముద్దాడ బైరాగి నాయుడు, నాయకులు చీపురు కృష్ణ, రాజాపు అప్పన్న, సురంగి నర్సింగరావు, బార్ల వేణుగోపాలరావు, నక్క తులసీదాస్, నాలుగు మండలాల నుంచి ప్రధాన నాయకులు పాల్గొన్నారు.


హిరమండలంలో ఈనాడు పత్రులను దహనం చేస్తున్న నాయకులు

పాతపట్నంలో..

పాతపట్నం: ఈనాడు దినపత్రిక దిగజారుడు వార్తలపై వైఎస్సార్‌సీపీ నాయకులు, పార్టీ శ్రేణులు ధ్వజమెత్తారు. పత్రికా విలువలకు ఏనాడో తిలోదకాలు వదిలి విషం చిమ్మడమే లక్ష్యంగా పెట్టుకున్నారని వైస్ ఎంపీపీ సవిరిగాన ప్రదీప్, ఏఎంసీ వైస్ చైర్మన్ మద్దు తాతయ్య, నాయకుడు పనుకు మోహన్ అన్నారు. నియోజకవర్గ కేంద్రమైన పాతపట్నం ఈనాడు దినపత్రిక పత్రులను దహనం చేశారు. టీడీపీ నాయకుడు పట్టాభికి గాయాలంటూ రెండేళ్ల క్రితం నాటి పాత ఫొటోలతో పాఠకులను తప్పుదోవ పట్టించడంతో పాటు రాష్ట్ర ప్రభుత్వంపై బుదజల్లేందుకు ప్రయత్నించిన ఈనాడు జర్నలిజం నిబంధనలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తుందన్నారు. పార్టీ నాయకులు కె.త్రినాథరావు, జి.రాము, ఎస్.కృష్ణారావు, ధనుంజయ, బోగిరాజు, తులుగు ప్రవీణ్, ఆఫీసు, రామారావు, టంకాల సుధాకర్, సుందరరావు పాల్గొన్నారు.

తప్పుడు వార్తలపై ఆగ్రహం

హిరమండలం: వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వంపై తప్పుడు వార్తలు ప్రచరిస్తున్న ఈనాడు దినపత్రికపై పార్టీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. టీడీపీకి మేలుచేకూర్చేందుకు అసత్య, ఆరోపణలు, నిరాధారణ వార్తలు రాయడం మానుకోవాలని హితవు పలికారు. హిరమండలం మండల కేంద్రంలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు మీసాల వెంకటరామకృష్ణ, పీఏసీఎస్ అధ్యక్షుడు ఏవీ సురేష్‌ల ఆధ్వర్యంలో ఈనాడు పత్రిక పత్రులను దహనం చేశారు. ఆ పత్రిక యజమాని రామోజీరావుకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ.. ఈనాడు దినపత్రిక చంద్రబాబును ముఖ్యమంత్రి చేయడం కోసం తన విలువలను దిగజార్చుకోవడం అవివేకమన్నారు. ప్రజా ప్రభుత్వంపై లేనిపోని ఆరోపణలు రాయడం దారుణమన్నారు. బడుగుబలహీన వర్గాలకు పెద్దపీట వేస్తున్న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని బలహీన పరిచేలా బూటకపు వార్తలు రాయడం తగదన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, మేజర్ పంచాయతీ ఉప సర్పంచ్ వెలమల బాలరాజు, శ్రీనివాసరావు ఉన్నారు.

పలువురికి ఎమ్మెల్యే పరామర్శ


లక్ష్మీనారాయణ కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి

పాతపట్నం: వివిధ కారణాలతో మృతి చెందిన పలువురి కుటుంబాలను ఎమ్మెల్యే రెడ్డి శాంతి శుక్రవారం పరామర్శించారు. పాతపట్నం మండల కేంద్రంలోని కొత్తకాపువీధికి చెందిన విశ్రాంత ఆర్మీ ఉద్యోగి లింగాల వైకుంఠరావు, ప్రశాంతినగర్‌కు చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు గుంపు ఆనంతరావు, బైరాగిపేటకు చెందిన సిరిపురం ప్రకాశరావు భార్య కాంతమ్మ ఇటీవల మృతి చెందడంతో వారి కుటుంబాలను పరామర్శించి సానుభూతి తెలియజేశారు. అలాగే పార్వతీపురం మన్యం జిల్లా భామిని మండలంలోని పసుకుడి వంశధార నదీ తీరం సమీపంలో ఈ నెల ఆరో తేదీన ఏనుగుల దాడిలో పాతపట్నం మండలం సవర తిడ్డిమి గ్రామానికి చెందిన ఎలిఫెంట్ ట్రాకర్ లోకొండ లక్ష్మీనారాయణ మృతి చెందాడు. దీంతో సవరతిడ్డిమి గ్రామంలో ఉన్న లక్ష్మీనారాయణ తండ్రి సింహాచలం, తల్లి అప్పలమ్మను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఆమె వెంట నాయకులు లింగాల రవికుమార్, వైస్ ఎంపీపీ ప్రదీప్, పనుకు మోహన్, తులుగు ప్రవీణ్, కోల్లు కృష్ణమూర్తి, టి.సుధాకర్ ఉన్నారు.

న్యాయవాదుల విధుల బహిష్కరణ


నినాదాలు చేస్తున్న న్యాయవాదులు

కొత్తూరు: న్యాయవాదులపై దాడులు జరగకుండా రక్షణ చట్టం తీసుకు రావాలని కొత్తూరు బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎం.అప్పారావు, వి.సుధాకర్ కోరారు. నల్గొండలో న్యాయవాది నారపాటి సురేంద్రపై కొంతమంది చేసిన దాడికి నిరసనగా కొత్తూరు కోర్టులో శుక్రవారం న్యాయవాదులు విధులు బహిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సురేంద్రపై దాడిచేసిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సభ్యులు రాడ రాజు, ఎ.ధర్మారావు, ఎ.ఉమామహేశ్వరరావు, వి.ఫాల్గుణరావు, సీహెచ్ రవి పాల్గొన్నారు.

మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించాలి


గొట్ట అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న విమలారాణి

హిరమండలం: అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలోని గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు మెనూ ప్రకారం అందించాలని కొత్తూరు ఐసీడీఎస్ సీడీపీవో విమలా రాణి అన్నారు. గొట్ట, చొర్లంగి, తుంగతంపర అంగన్‌వాడీ కేంద్రాలను శుక్రవారం సందర్శించారు. కేంద్రాల నిర్వహణకు సంబంధించిన పలు రికార్డులు తనిఖీ చేశారు. కేంద్రాల్లో నిల్వ ఉన్న సరుకులను పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. పలు అంగన్‌వాడీ కేంద్రాల్లో మెనూ ప్రాప్తికి పౌష్టికాహారం లబ్ధిదారులకు అందించడం లేదని ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. అలాగే చిన్నారులు సాయంత్రం వరకు కేంద్రాల్లో ఉంచడం లేదని తమ దృష్టికి వచ్చిందన్నారు. చిన్నారులకు ప్రీ స్కూల్‌కు సంబంధించిన ఆట, పాటలు నేర్పించాలన్నారు.

బస్టాండ్‌లో మరుగుదొడ్ల నిర్మాణం


మరుగుదొడ్ల నిర్మాణ పనులు పరిశీలిస్తున్న దృశ్యం

పాతపట్నం: పాతపట్నం పంచాయతీ కార్యాలయం పక్కన ఉన్న బస్టాండ్‌లో సుమారు రూ. 25 లక్షలతో మరుగుదొడ్ల నిర్మాణం చేపడుతున్నట్లు సర్పంచ్ శిర్ల వేణుకుమారి తెలిపారు. పంచాయతీ ఈవో కుర్మారావుతో కలిసి మరుగుదొడ్ల నిర్మాణ పనులను శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మరుగుదొడ్ల నిర్మాణానికి అనకాపల్లికి చెందిన శ్రీలక్ష్మి నర్సింహా స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో మహిళలు, పురుషులకు వేర్వేరుగా మరుగుదొడ్లు, స్నానపు గదుల నిర్మాణం చేపడుతున్నామన్నారు. ప్రజలకు 24 గంటలు ఇవి అందుబాటులో ఉంటాయని, స్నానాలకు వెడినీటి సదుపాయం ఉంటుందన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు శిర్ల జోగారావు, పంచాయతీ జూనియర్ అసిస్టెంట్ దిలీప్‌కుమార్ పాల్గొన్నారు.

ఆక్రమణలు తొలగించండి

పాతపట్నం: పాతపట్నంలోని ప్రభుత్వ స్థలాలను కొంతమంది వ్యక్తులు ఆక్రమిస్తున్నారని.. వాటిని రక్షించాలని వైఎస్సార్‌సీపీ నాయకుడు బి.నారాయణమూర్తి కోరారు. ఈ మెరకు తహసీల్దార్ రవిచంద్రను శుక్రవారం కలిసి వినతిపత్రం అందజేశామన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాతపట్నం నీలమణిదుర్గ ఆలయం కూడలిలోని టెక్కలి రహదారి, నీలమణిదుర్గ అమ్మవారి గుడి కాలనీకి రహదారి లేకుండా ప్రభుత్వ స్థలాలు ఆక్రమణలు జరిగాయన్నారు.

ఓపెన్‌స్కూల్‌లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

సరుబుజ్జిలి: ఓపెన్‌స్కూల్ ద్వారా ఇంటర్మీడియేట్‌లో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ రాబిల్లి భూషణరావు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. పదో తరగతి ఉత్తీర్ణత పొంది, ఇంటర్మీడియెట్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం వివిధ కారణాలతో చదువు మానేసినవారు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్నవారు పదో తరగతి ఒరిజినల్ సర్టిఫికెట్, ఆధార్‌కార్డు, కుల ధ్రువీకరణ పత్రం, పాస్‌ఫొటోలతో ఈనెల 27వ తేదీలోగా కళాశాలలో సంప్రదించాలని సూచించారు.

నరసన్నపేట: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఓపెన్ స్కూల్ ఇంటర్మీడియెట్ ప్రవేశాలకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతున్నామని ప్రిన్సిపాల్ వి.నారాయణ స్వామి తెలిపారు. వివరాలకు తమను సంప్రదించాలన్నారు.